## క్లుప్తంగా

### కలెక్టర్‌కు ఎన్‌జీఓ నేతల శుభాకాంక్షలు



కలెక్టర్ వెట్రిసెల్వికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఏలూరు(మెట్రో): కలెక్టర్‌గా వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా కె.వెట్రిసెల్వికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏపీఎన్‌జీవోస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌కు మొక్కను బహూకరించారు. ఏపీఎన్‌జీవోస్ తరుపున విద్యార్థులకు పంపిణీ చేసేందుకు 500 నోటుపుస్తకాలను కలెక్టర్‌కు అందజేశారు. కలెక్టర్ ఏడాది కాలంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి విశేష చొరవ చూపారని సంఘం అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నేతలు జీఎస్ రాజు, కేఎస్ఆర్ మోహన్, ఎండీ బేగ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

### తప్పిపోయిన పిల్లలు సురక్షితం



పిల్లలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్సై రాజా

ఏలూరు టౌన్: ఏలూరు చేపలతూము సెంటర్ ప్రాంతానికి చెందిన ఇద్దరు బాలురు తప్పిపోయారు. స్థానికంగా వెదికినా కనిపించకపోవటంతో కుటుంబ సభ్యులు టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు గంటల వ్యవధిలోనే పిల్లలు ఇద్దరినీ సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. చేపలతూము సెంటర్ ప్రాంతానికి చెందిన బజంత్రీకుమార్ వెంకటరావు కుమారులు మణికంఠ (9) సోనుదీక్షిత్ (11)లు ఆడుకునేందుకు వచ్చి కనిపించలేదు. తండ్రి వెంకటరావు ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై మధు వెంకటరాజా, హెడ్ కానిస్టేబుల్ రవి, సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. చిన్నారులు సురక్షితంగా దొరకడంతో వారికి కౌన్సెలింగ్ ఇచ్చి తండ్రి వెంకటరావుకు అప్పగించారు. పోలీసులకు వెంకటరావు కృతజ్ఞతలు తెలిపారు.

### స్కూల్ గుర్తింపు రద్దు

కామవరపుకోట: ఇటీవల పలు వివాదాల నేపథ్యంలో మండలంలో తడికలపూడి హర్షిత ఇంగ్లీష్ మీడియం స్కూల్ గుర్తింపు రద్దు చేసినట్లు ఎంఈఓ డి.సుబ్బారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరం వరకు ఆ పాఠశాలలో చదివిన విద్యార్థుల సౌకర్యార్థం వారి టీసీలు, రికార్డ్ సీట్స్ మండల విద్యాశాఖ కార్యాలయంలో తీసుకోవాలని, పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 79818 47878లో సంప్రదించాలని ఎంఈఓ కోరారు.

# మతాలకు అతీతంగా మొహర్రం

- నేటి నుంచి నెల ప్రారంభం
- ఏలూరులోని 15 పంజాల్లో నిత్యం ప్రత్యేక ప్రార్థనలు
- మొక్కులు తీర్చుకోనున్న హిందూ, ముస్లింలు



పోణంగిలోని బీబీ ఫాతిమా హజరత్ మౌలాలి పంజాలో ప్రార్థనలు



ఏలూరు చేపల చెట్టు సెంటర్‌లోని సింగమహల్లా పంజా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అమర వీరుల నెల (షహీద్)గా నిర్వహించే మొహర్రం నెల ఈ నెల 27వ తేదీ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఆ రోజు నుంచే ఇస్లాం నూతన సంవత్సరం కూడా ప్రారంభమౌతుంది. ముస్లింలు ప్రజలంతా సోదరభావంతో మెలుగుతూ క్షేమంగా, సుఖ శాంతులతో, ఆరోగ్య, ఐశ్వర్యాలతో జీవించాలని కోరుతూ మొహర్రం నిర్వహిస్తుంటారు. నగరంలోని దాదాపు అన్ని ఆస్థానాల్లోనూ మొహర్రం కార్యక్రమాలను నిర్వహిస్తారు. గత ఏడాది కొందరు ముస్లిం ప్రముఖులు పీర్ల పంజా కమిటీగా ఏర్పడ్డారు. నిధుల లేమి కారణంగా మొహర్రం కార్యక్రమాలు నిర్వహించలేని పేద పంజాలు (ఆస్థానాలు)లకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. ముస్లింలు మొహర్రంను వర్ధంతిలా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు.

**కోర్కెలు నెరవేరుతాయనే నమ్మకం**

పెట్టెల్లో భద్రపరచిన వెండి, ఇత్తడి తదితర లోహాలతో తయారు చేసిన పీర్లను బయటకు తీసి, మెరుగులు దిద్ది సుందరంగా పూలతో అలంకరించి మొహర్రం సందర్భంగా నగరంలోని వివిధ ఆస్థానాల్లో పీర్ల ప్రతిష్ఠ చేస్తారు. ఈ కార్యక్రమం ఈనెల 27న ఏలూరు కుండీ సెంటర్‌లోని గొలుసుల పంజాతో పాటు పోణంగి రోడ్డులోని ఖాదర్‌బాబా ఇమామ్ ఏ ఖాసిం ఆస్థానంలో నిర్వహిస్తారు. మరో ఐదు రోజుల తరువాత ఇతర ఆస్థానాల్లో కూడా పీర్ల ప్రతిష్ఠ చేస్తారు. అప్పటి నుంచి నిత్యం భక్తులు పీర్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవడం అనవాయితీగా వస్తోంది. పీర్ల వద్ద పూల అలంకారం చేసి మరమరాలు, అటుకులు, శనగ పప్పు, బూందీతో చేసే ప్రసాదాన్ని నైవేద్యంగా పెడితే పిల్లలు పుడతారనే నమ్మకంతో హిందువులు సైతం ఈ విధంగా చేస్తారు. పిల్లలు పుట్టిన వారు తమ కోరికలు నెరవేరడంతో మహాత్ముల పీర్లకు వెండి ఊయలలు, హస్తాలు సమర్పిస్తారు.

**అగ్ని గుండం తొక్కే కార్యక్రమం**

మొహర్రం కార్యక్రమాల్లో అగ్నిగుండం తొక్కే కార్యక్రమం ప్రధానమైంది. ఈ కార్యక్రమాన్ని అత్యంత పవిత్రంగా భావించి ఎంతోమంది నిప్పుల గుండాన్ని తొక్కుతారు. గన్‌బజారు జల్ జలా సాహెబ్ ఆస్థాన, పోణంగిలోని మౌలాలి ఆస్థానలో ఈ నిప్పుల గుండాన్ని తొక్కే కార్యక్రమం ఏటా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాలు మొహర్రం నెల ప్రారంభమైన 7వ రోజు, 9వ రోజు అంటే జూలై 3, 5 తేదీల్లో నిర్వహించనున్నారు.

**నిత్యం ప్రార్థనలు**

ఏలూరు పరిసర ప్రాంతాల్లోని 15 ఆస్థానాల్లో మొహర్రం కార్యక్రమాల్లో భాగంగా ప్రతి నిత్యం ప్రత్యేక ప్రార్థనలు, దరూదె సలాం, ఫాతెహా ఖానీ నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా స్థానిక కుండీ సెంటర్‌లోని మౌలా అలి ముష్కిల్ కుష ఆస్థాన (గొలుసుల పంజా) పంజా, గన్ బజారులోని జల్ జలా సాహెబ్ ఆస్థానాలతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఇమామ్ ఏ ఖాసిం పంజా, సింగమహల్లా పంజా, లతీఫ్ తికియా ఖాదర్ జండా పంజా, అబ్బాస్ అలీ పంజా, బీబీ ఫాతిమా పంజా, గాజుల పంజా, ఏడు కాలువల సెంటర్ పంజా తదితర పంజాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు.



కుండీ సెంటర్‌లోని గొలుసుల పంజా

**పీర్ల నిమజ్జనంతో ముగింపు**

ప్రతిష్ఠించిన పీర్లను జూలై 6న పండుగను పురస్కరించుకుని నిమజ్జనం చేయడంతో మొహర్రం పూర్తవుతుంది. దీని కోసం పీర్ల పంజా కమిటీ భారీ ఏర్పాట్లు చేస్తోంది. మధ్యాహ్నం నుంచి ఆయా ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన పీర్లను విశేషంగా అలంకరించి స్థానిక కుండీ సెంటర్‌లోని గొలుసుల పంజా వద్దకు తీసుకొస్తారు. అక్కడి నుంచి నగర వీధుల్లో భారీ ఊరేగింపుగా వెళుతూ భక్తులకు దర్శనం కల్పిస్తారు. సాయంత్రం పాత బస్టాండు ప్రాంతంలోని కర్బలా మైదానం వద్దకు చేరుకుని అక్కడున్న నూతిలో పీర్లను నిమజ్జనం చేస్తారు.

**త్యాగానికి, శాంతికి ప్రతీక**



త్యాగానికి, శాంతి సామరస్యాలకు ప్రతీకగా మొహర్రం నిర్వహిస్తారు. శాంతియుత ఇస్లాం ధర్మ స్థాపన కోసం కర్బలా యుద్ధంలో ప్రాణత్యాగం చేసిన మహ్మద్ ప్రవక్త మనుమడైన హజరత్ ఇమామ్ ఏ హుస్సేన్‌ను స్మరిస్తూ వర్ధంతి కార్యక్రమంగా చేస్తారు. దాదాపు అన్ని పంజాల్లో ముస్లంలతో పాటు హిందువులు కూడా ప్రార్థనలు చేయడం ఏలూరులోని ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు.

– ఎండీ గాలబ్ అలీ, గొలుసుల పంజా ముజావరు

### డీసీసీబీ సాధారణ మహాజన సభ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ సాధారణ మహాజన సభ గురువారం స్థానిక బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి గన్ని వీరాంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. బ్యాంక్ సీఈఓ పి.సింహాచలం, ఏలూరు డీసీఏఓ కె.వెంకటేశ్వరరావు, పశ్చిమ గోదావరి జిల్లా డీసీఓ ఎస్ మురళీకృష్ణ, తూర్పు గోదావరి జిల్లా డీసీఓ ఎం వెంకట రమణ, పశ్చిమ గోదావరి జిల్లా డీఆర్/డీసీఏఓ ఎ.శ్రీనివాస్, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జీలు, బ్యాంక్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 2024 – 25 సంవత్సరానికి బ్యాంక్ వార్షిక నివేదిక, ఆడిట్ రిపోర్ట్, సొసైటీల రైతుల పీఏఐఎస్ పాలసీ ప్రీమియంలో డీసీసీబీ వాటా చెల్లించడానికి ఆమోదం తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక చాణక్యపురి కాలనీ ఫీడర్‌లో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు చాణక్యపురి కాలనీ, ఆర్ఎంఎస్ కాలనీ, డీ మార్ట్ ఏరియా, మోతేవారి తోట, మంచి నీళ్ల తోట, మంచెర్ల వారి వీధి, గాంధీ బొమ్మ రోడ్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. కోటదిబ్బ సబ్‌స్టేషన్ పరిధిలోని అగ్రహారం, అంబికా సెంటర్, న్యూ మార్కెట్ ఏరియా, తూర్పువీధి, మెయిన్ బజార్, టీచర్ కాలనీ, వెన్నవల్లివారిపేట, నవాబ్ పేట, సత్యనారాయణ పేట, బావిశెట్టివారి పేట, లంబాడి పేట, బెనర్జిపేట, కెనాల్ రోడ్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

## ఛత్రపతి సాహు మహారాజ్‌కు ఘన నివాళి



సాహుమహారాజ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): దేశంలో రిజర్వేషన్లు అమలు చేసిన తొలి అభ్యుదయ వాది, రిజర్వేషన్ల పితామహుడు సాహుమహారాజ్ అని ఏఐఏవైఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ కొనియాడారు. సాహుమహారాజ్ 151వ జయంతిని పురస్కరించుకుని స్థానిక ఎన్ఆర్‌పేటలోని ఏఐఏవైఎస్ అండ్ ఎస్‌సీఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన చిత్ర పటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్‌కి విదేశాల్లో విద్య నేర్చుకోవడానికి స్కాలర్‌షిప్ అందజేయడమే కాకుండా ఆయన ప్రారంభించిన మూక్ నాయక్ పత్రిక నడపటానికి ఆర్థికంగా ఎంతో సహకారం అందించారని గుర్తుచేశారు. సాహు మహారాజ్ తీసుకొచ్చిన సంస్కరణల వల్లే మన దేశంలో అందరికీ విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి అంబేద్కర్ రాజ్యాంగంలో రిజర్వేషన్ల విధానాన్ని తీసుకొచ్చారని వివరించారు. కార్యక్రమంలో చిలకా సుబ్బారావు,నూకపెయ్యి కార్తీక్, తెనాలి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### బ్యాంకు ఉద్యోగుల ప్రదర్శన



ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న బ్యాంకు ఉద్యోగులు

ఏలూరు (టూటౌన్): జూలై 9న నిర్వహించే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతుగా స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ కోటక్ మహేంద్ర బ్యాంక్ వద్ద గురువారం బ్యాంకు ఉద్యోగులు ప్రదర్శన నిర్వహించారు. ఏలూరు, చుట్టుపక్కల బ్యాంకు శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ సంఘం అధ్యక్షుడు దుగ్గిరాల శ్రీనివాస్ మోహన్ మాట్లాడుతూ కేంద్రం బ్యాంకుల విలీనం పేరుతో బ్యాంకింగ్ సెక్టార్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కార్మిక వర్గం ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న 44 చట్టాలను రద్దుచేసి నాలుగు కార్మిక కోడ్లను తీసుకొచ్చిందన్నారు. కేంద్రం అనుసరిస్తోన్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నిర్వహించే సమ్మెలో బ్యాంకు ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు లక్ష్మణరావు, ఇండియన్ బ్యాంక్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు రామకోటి రెడ్డి, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగ సంఘ నాయకులు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

### తాటిచెట్లను తొలగించాలని ఆందోళన

టి.నరసాపురం: రోడ్డుకు అడ్డంగా వేసిన తాటిచెట్లను తొలగించాలని కేతవరం పంచాయతీ బర్రెవారిగూడెం మహిళలు ఆందోళన చేశారు. తాము ఎంతో కాలంగా నడిచే రోడ్డు మార్గాన్ని కొందరు వ్యక్తులు తాటిచెట్లు, ముళ్లకంప వేసి మూసివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై వేసిన తాడిచెట్లు, కంచెను తొలగించాలని, వీటిని వేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సుమారు 30 కుటుంబాలు వినియోగించుకుంటున్న రహదారిని మూసివేయడంతో గత రెండు రోజులుగా బయటకు వెళ్లే దారి లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని వారు కోరారు.

### గిరిజనులకు పథకాలు సక్రమంగా అందాలి

చింతలపూడి : మైదాన ప్రాంత గిరిజనులకు ఐటీడీఏ ద్వారా సంక్షేమ పథకాలు సక్రమంగా అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ బి.రాంబాబు నాయక్ కోరారు. చింతలపూడి మండలం రేచర్ల గ్రామంలో ధర్తీ అభ జన్ భాగీదరి గ్రామ్ ఉత్సవ్ అభియాన్ కార్యక్రమాన్ని గురువారం సర్పంచ్ శివరామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను గిరిజన ప్రాంతాల్లోనే ఖర్చు పెట్టాలని కోరారు. సంక్షేమ పథకాల అమలులో అర్హులకు న్యాయం చేయాలన్నారు. కేంద్రం సహకారంతో పించన్లు, ఇళ్ల స్థలాలు ఐటీడీఏ ద్వారా మంజూరు చేయించి ప్రభుత్వమే ఇళ్లను నిర్మించాలని కోరారు. ఎంపీడీఓ మురళీకృష్ణ మాట్లాడుతూ ఎస్టీలు నివసించే ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ రక్తం కుమార్ అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలతో ఆరోగ్యానికి ముప్పు



ఏలూరు (టూటౌన్) : మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్



దెందులూరు : పోణంగిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): మాదక ద్రవ్యాల వినియోగం వల్ల యువత మేధస్సు నశిస్తుందని, నైపుణ్యతను కోల్పోతారని, ఆరోగ్యము క్షీణిస్తుందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ హెచ్చరించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఆయన ప్రపంచ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా క్రీడ విభాగం క్రీడాకారులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంఘ విద్రోహులు యువత బలహీనతలను ఆసరాగా తీసుకుని మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడుతున్నారన్నారు. మాదక ద్రవ్యాలను సేవించిన, అక్రమ రవాణా చేసిన చట్టాలు కఠినంగా శిక్షిస్తాయని, తద్వారా భవిష్యత్తు అంధకారం అవుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను ప్రోత్సహించబోమని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో డీసీపీఓ సీహెచ్ సూర్య చక్రవేణి, రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్, ప్యానల్ లాయర్లు బి.శ్రీలక్ష్మి, పి.రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

**పోణంగిలో ర్యాలీ**

దెందులూరు: యువత మత్తు పదార్థాలకు అలవాటు పడితే వారి భవిష్యత్ నాశనమవుతుందని ఏలూరు రూరల్ ఎస్సై దుర్గాప్రసాద్ అన్నారు. విజయవాడ నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం పోణంగి ఉన్నత పాఠశాల నుంచి సెంటర్ వరకు గ్రామస్తులు, యువత, మహిళలు ర్యాలీ నిర్వహించారు. నవజీవన్ బాల భవన్ ప్రోగ్రామ్ మేనేజర్ ఆంజనేయులు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు అలవాటు పడితే పోలసానిపల్లి గ్రామంలో బోస్కో డీ అడెక్షన్ సెంటర్‌లో సంప్రదించాలన్నారు. నూజివీడు కళాజాత జానపద కళాకారులు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ జి.సాంబశివరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 30 | అరటి కాయ (1) | 06–08 |
| వంకాయలు (గులాబీ) | 28 | చిక్కుడు కాయలు | 70 |
| వంకాయలు (కాంతులు) | 34 | బిళ్లచిక్కుడు | -- |
| వంకాయలు (తెలుపు) | 38 | చామదుంపలు | 36 |
| బెండకాయలు | 38 | ములక్కాడలు | 08, 10 |
| పచ్చిమిర్చి | 38 | కంద | -- |
| కాకర కాయలు | 46–56 | బీట్‌రూట్ | 40 |
| బీరకాయలు | 30 | కీరా దోస | 40 |
| బీరకాయలు (పందిరి) | 40 | ఫ్రెంచ్‌బీన్స్ | 100 |
| క్యాబేజీ | 24 | అల్లం | 60 |
| క్యారెట్ | 45 | కొత్తిమీర (కట్ట) | 20 |
| దొండకాయలు | 34 | పాలకూర | 12 |
| బంగాళదుంపలు | 30 | తోటకూర | 10 |
| ఉల్లిపాయలు | 28 | చుక్కకూర | 12 |
| గోరుచిక్కుడు | 40 | గోంగూర | 07–10 |
| దోసకాయలు | 20 | పుదీనా | 05 |
| అనబకాయ (1) | 10–15 | క్యాప్సికమ్ | 90 |
| పొట్లకాయ(1) | 20 | చిలకడదుంప | 40 |

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

**ఏసీ బస్సులు..**

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర) | 21.00 | 38 |
| ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర) | 21.30 | 34 |
| ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి) | 22.00 | 41 |
| ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్) | 22.30 | 17 |
| ఏలూరు – అమరావతి (ఇంద్ర) | 19.00 | రద్దు |

**సూపర్ లగ్జరీ**

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు –బీహెచ్ఈఎల్ | 21.45 | 4820 | 29 |
| ఏలూరు –బీహెచ్ఈఎల్ | 21.15 | 4822 | 32 |
| ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 26 |
| ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం | 10.45 | 4798 | 22 |
| ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం | 21.15 | 4802 | 33 |
| ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం | 21.00 | 4804 | 36 |
| ఏలూరు –ఈసీఐఎల్ | 22.30 | 4814 | 25 |
| ఏలూరు – తిరుపతి | 16.00 | 4830 | 34 |

# ఖరీఫ్ సాగుకు ఊతమిచ్చిన వాన

- విత్తనాల సొంత తయారీ మేలంటున్న వ్యవసాయాధికారులు
- మేలైన వంగడాలను ఎంపిక చేసుకోవాలని సూచన



సార్వాకు నారుమడి సిద్ధం చేసుకుంటున్న రైతులు

గణపవరం: సకాలంలో కురుస్తున్న వానలు సార్వా సాగుకు ఊపిరి పోశాయి. ఏటా వేసవి దుక్కుల తరువాత సార్వా నారుమడులు వేయడానికి వర్షాల కోసం రైతులు ఎదురు చూడటం ఆనవాయితీ కాగా ఈ ఏడాది మే నెలలోనే వర్షాలు ప్రారంభమయ్యాయి. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు సకాలంలో నారుమడులు వేయడానికి అవకాశం వచ్చింది. ఈ నెల మూడో వారం నుంచి వర్షాలు ప్రారంభం కావడంతో సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది దాళ్వా పంట రైతులకు సిరులు కురిపించింది. ఈ సార్వా కూడా ఆశాజనకంగానే ఉంటుందని రైతులు ఆశిస్తున్నారు. ఇందులో భాగంగా ఉంగుటూరు నియోజకవర్గంలో ఆకుమడులు వేసేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

**నియోజకవర్గంలో 26 వేల హెక్టార్ల సాగు**

నియోజకవర్గంలో సుమారు 26 వేల హెక్టార్ల విస్తీర్ణంలో సార్వా సాగు చేస్తున్నారు. దీంతో 16 వేల హెక్టార్ల విస్తీర్ణం మెట్ట ప్రాంతాలైన ఉంగుటూరు, భీమడోలు మండలాల్లో సాగవుతుంది. దీనిలో 50 శాతం కాలువ కింద, మరో 50 శాతం బోర్ల కింద సాగు చేస్తుండగా, డెల్టా మండలాలైన గణపవరం, నిడమర్రు మండలాల్లో మొత్తం కాలువ కింద సాగు చేస్తున్నారు. బోర్ల కింద సాగయ్యే ప్రాంతాల్లో ఇప్పటికే నారుమడులు వేయగా కాలువల కింద సాగయ్యే ప్రాంతాల్లో రైతులు నారుమడులు సిద్ధం చేస్తున్నారు. మరి కొన్ని చోట్ల నారుమడులు మొలకలు వస్తున్నాయి. ఈ ఏడాది రుతు పవనాలు త్వరగా వస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతన్నలు సార్వా సాగుకు ముందుగానే సమాయత్తమవుతున్నారు. ఇందులో భాగంగా విత్తనాలు సిద్ధం చేసుకున్నారు. ఈ ఖరీఫ్‌లో ఎక్కువగా స్వర్ణ, పిల్ రకాలతో పాటు పీఎల్‌ఏ 1100, ఎంటీయూ 1064, ఎంటీయూ 1061, ఎంటీయూ 1318 రకాలను సాగు చేస్తున్నారు. ఉప్పు, చౌడు లక్షణాలున్న భూముల్లో ఎంసీఎం 100, ఎంటీయూ 1262, 1061, 1064 రకాలు, ముంపు ఉండే భూముల్లో ఎంటీయూ 1232 రకం, సాధారణ నేలల్లో ఎంటీయూ 1318, 1121 వంటి రకాలు అనుకూలంగా ఉంటాయని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.


**రైతు స్థాయిలోనే విత్తనాలు**

ఎక్కువ మంది రైతులు విత్తనాలను స్వయంగా సమకూర్చుకుంటున్నారు. గత దాళ్వాలో విత్తనాల కోసం ప్రత్యేకంగా సాగు చేసి, వాటిని ఒబ్బిడి చేసి సార్వాకు సిద్ధం చేసుకున్నారు. దీంతో రైతు స్థాయిలోనే విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. విత్తనాల బస్తా రూ.2000 నుంచి రూ.2200 పలుకుతుంది. దీంతో రైతులు విత్తనాల కోసం బయట వ్యాపారులపై ఆధారపడే పరిస్థితి లేదు. కొద్ది మంది రైతులు మాత్రమే వ్యాపారుల వద్ద విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. బయట మార్కెట్‌లో కొనుగోలు చేసే రైతులు నాణ్యతను పూర్తిగా పరీక్షించి, గుర్తింపు పొందిన కంపెనీ విత్తనాలు కొని బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

**పెట్టుబడి కోసం తిప్పలు**

గత ప్రభుత్వ హయాంలో రైతులకు సాగు ఆరంభ సమయానికి రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయంగా రూ.13 వేలు అందించే వారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు ఈ పెట్టుబడి సాయం రూ.20 వేలకు పెంచుతామని ఊదర గొట్టిన ప్రభుత్వం ఏడాది కాలం దాటినా రైతులకు చిల్లిగవ్వ సాయం అందించలేదు. దీంతో రైతులు రబీ, ఖరీఫ్ పంటలకు పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించక తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతు భరోసాను అన్నదాత సుఖీభవ అని పేరు మార్చారు తప్ప ఆచరణలోకి ఎప్పుడు వస్తుందోనని రైతులు నిట్టూరుస్తున్నారు.

**యాజమాన్య పద్ధతులతో మేలు**



సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు అవలంభిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటం వలన సాగుకు అనుకూల వాతావరణం ఉంది. దమ్ము చేసే సమయంలో పొలంలో భాస్వరం వేయడం ద్వారా వేరు వ్యవస్థ బలంగా ఉంటుంది. వర్షాలకు పైరు నేల వాలకుండా పటిష్టంగా నిలబడుతుంది.

– ఆర్ఎస్ ప్రసాద్, ఏవో, గణపవరం

## చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తాం

వైఎస్సార్‌సీపీ కార్యదర్శి గురునాథరావు

లింగపాలెం: ముఖ్యమంత్రి చంద్రబాబు ఏడాది పాలనలో చేసిన మోసాలపై త్వరలో ప్రజలకు వివరిస్తామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు జెట్టి గురునాథరావు అన్నారు. గురువారం లింగపాలెంలోని పార్టీ నేత బీవీఎస్ రెడ్డి గెస్ట్ హౌస్‌లో ఆయన ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ ఏడాది పాలనలో చంద్రబాబు పూర్తిగా అమలుచేయలేదని జెట్టి అన్నారు. ప్రజలకు సమాధానం చెప్పే ధైర్యం లేకే ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కుట్ర రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు పాలన వల్ల ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి అధ్వానంగా మారిందన్నారు. కూటమి నేతల దుష్ప్రచారాలు, డైవర్షన్ పాలిటిక్స్‌పై ప్రజలకు పూర్తిగా అవగాహన వచ్చిందని వివరించారు. మాజీ సీఎం, ప్రతిపక్ష నేత జగన్ ఆదేశాల మేరకు త్వరలో ఐదు వారాలు పాటు ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు పాలనలో ప్రజలకు జరిగిన నష్టాన్ని వివరిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి, మండల ముఖ్య నేత ముసునూరి వెంకటేశ్వరరావు, అన్నపనేని శాంతారావు, బి.ప్రభాకరరెడ్డి, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, జంగారెడ్డిగూడెం మాజీ జెడ్పీటీసీ ముప్పిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.